

మైదుకూరులో అత్యధిక వర్షపాతం

ప్రజాశక్తి - కడప

మైదుకూరు మండలంలో అత్యధికంగా 16.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లావ్యాప్తంగా ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలు.. కడపలో 2.4, కమలాపురం 8.6, వల్లూరులో 2.6, చెన్నూరులో 8.6, చింతకొమ్మదిన్నె మండలంలో 3.4, పెండ్లిమర్రిలో 4.2, కాజీపేట లో 11.4, ఒంటిమిట్టలో 3.0, బద్వేలులో 6.6, బి. మఠంలో 11.8, కాశినాయన మండలంలో 11.8, కలసపాడులో 15.4, పోరుమామిళ్లలో 1.2, బి కోడూరులో 5.6, గోపవరంలో 5.2, కొండాపురంలో 0.4 మిలీ మీటర్ల వర్షపాతం నమోదైంది. రాజుపాలెంలో 4.0, ప్రొద్దుటూరులో 2.6, ముద్దనూరులో 5.2, చాపాడులో 5.6, దువ్వూరులో 4.2, ఎర్రగుంట్లలో 9.8, సింహాద్రిపురం లో 8.8, చక్రాయపేటలో 2.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లావ్యాప్తంగా సగటున 4.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు.

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం



- విత్తనం, ఎరువుల కొనుగోలు పనుల్లో రైతులు నిమగ్నం

- ఈ ఏడాది సాగు పెంచేందుకు ప్రణాళికలు

ప్రజాశక్తి - చాపాడు

ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు దుక్కులు చేపట్టి పచ్చిరొట్ట, సేంద్రియ ఎరువులు సేకరణ వంటి పనులు చేపడుతున్నారు. పసుపు సాగు చేసే రైతులు విత్తన సేకరణ, ఎరువుల కొనుగోలు రుణాల సేకరణ వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. అధికార యంత్రాంగం కూడా సంసిద్ధమైంది. ఇందుకోసం ప్రణాళికలు సిద్ధం చేసింది. రసా యనిక ఎరువులు, విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందించేందుకు జిల్లా వ్యవసా యాధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. మరోవైపు గత ఖరీఫ్ కంటే ఈసారి సాగు పెంచేలా రైతులను ప్రోత్స హిస్తున్నారు. నూతన ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మార్పులు చేర్పులు జరగవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. రెండేళ్ల కిందట జిల్లాలో భారీ వర్షాలు కురవ డంతోపాటు జిల్లాలోని అన్ని సాగునీటి వనరులను ప్రభుత్వం కృష్ణాజలాలతో నింపింది. మరోవైపు భూగర్భ జలాలు పైకి చేరడంతో వేలాది బోరు బావుల్లోనూ పుష్కలంగా నీరు చేరింది. గత ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులతో పంటల సాగు పూర్తిగా తగ్గింది. ప్రస్తుతం సీజన్‌లో వర్షాలు ప్రారంభం కావడంతో గతంతో పోలిస్తే ఈ ఏడాది సాగు మరింత పెరగనుంది.

ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగును మరింత పెంచాలని ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో పులివెందుల, మైదుకూరు, కమలాపురం, జమ్మలమడుగు తదితర ప్రాంతాలలో వేరు శనగ, వరి, శనగ తదితర పంటలు సాగు చేస్తారు. మైదుకూరు, ప్రొద్దుటూరు, కమలాపురం, బద్వేలు, కడప తదితర ప్రాంతాల్లో వరితోపాటు పసుపు, మిరప, పత్తి, మొక్కజొన్న, సజ్జ తదితర పంటలను సాగు చేస్తారు. రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాల్లో పండ్ల తోటలతోపాటు వరి, చెరుకు, మా మిడి, వేరుశనగ, సన్‌ఫ్లవర్, ఇతర కూరగాయల పంటలు విరివిగా సాగు చేస్తారు. 2019 ఖరీఫ్‌లో 73,792 హెక్టార్లలో పంటలు సాగు కాగా, 2020 ఖరీఫ్‌లో 1,10,127 హెక్టార్లలో, 2021-22 ఏడాదుల్లో 1,24,000 హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. 2023 లో సాగు గణ నీయంగా తగ్గింది. 70వేల హెక్టార్లకే పరి మితమైంది. ఈ ఏడాది సాగును మరింత పెంచాలన్నది ప్రభుత్వ లక్ష్యం.

68,756 క్వింటాళ్ల పంపిణీకి చర్యలు..

ఖరీఫ్‌లో 68,756 క్వింటాళ్ల వివిధ రకాల విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందిస్తు ఒదన్నారు. ఇందులో ప్రధానంగా 14,602 క్వింటాళ్లు కేబీ రకం, వేరుశనగ విత్తనాలు, 1500 క్వింటాళ్లు నారాయణి రకం, 1000 క్వింటాళ్లు టీఏజీ - 24 రకం విత్తనాలు, అలాగే 950 క్వింటాళ్ల మినుములు, 692 క్వింటాళ్లు ఎల్‌బీజీ - 752 రకం మినుము విత్తనాలు, 418 క్వింటాళ్లు పీబీజీ - 104 రకం విత్తనాలకు ప్రతిపాదనలు పంపారు. వీటితోపాటు 39,870 క్వింటాళ్ల శనగలు, 4780 క్వింటాళ్ల జీలుగ, 463 క్వింటాళ్ల జనుము, 80 క్వింటాళ్ల పిల్లి పెసర తదితర విత్తనాలను పంపిణీ చేస్తు న్నారు. వైఎస్ఆర్ రైతు భరోసా కింద ఏటా 2,98,673 మంది రైతులకు ఆర్థికసాయం అందిస్తుండగా, సున్నా వడ్డీ పంట రుణాల కింద 90,000 మందికి సుమారు రూ. 50 కోట్ల మేర లబ్ధి చేకూరింది. ఇక పంటల బీమా కింద 2,89,922 మందికి రూ. 777.50 కోట్లు లబ్ధి చేకూరింది. మరోవైపు తగిన మేర సబ్సిడీ విత్తనాలను ప్రభుత్వం అందిస్తోంది. ఖరీఫ్ సాగు 1.35 లక్షల హెక్టార్లపైనే గత ఏడాది ఖరీఫ్‌లో 70వేల హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగ య్యాయి. ఈ సంవత్సరం దీన్ని1,35,100 ఎకరాలకు పైగా పెంచాలన్నది లక్ష్యం. ప్రధానంగా 33,994 హెక్టార్లలో వరి, 23,698 హెక్టార్లలో పత్తి, 23,149 హెక్టార్లలో వేరుశనగ, 3,578 హెక్టార్లలో కంది, 2563 హెక్టార్లలో సన్‌ఫ్లవర్, 2,603 హెక్టార్లలో శనగ, 177 హెక్టార్లలో పెసర, 276 హెక్టార్లలో జొన్న, 43 హెక్టార్లలో చెరకు, 2828 హెక్టార్లలో పసుపు, 4833 హెక్టార్లలో ఉల్లిగడ్డలు, 948 హెక్టార్లలో చీనీ, 1754 హెక్టార్లలో టమాటా తదితర పంటలను సాగు చేయించాలన్నది లక్ష్యం. మొత్తంగా 1,35,100 హెక్టార్లలో ఖరీఫ్ సాగును అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

సాగుకు ఏర్పాట్లు చేస్తున్నాం

ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వరి పంట సాగుకు ఏర్పాట్లు చేపడుతున్నాం. ఇప్పటికే జీలగ విత్తనాలు సేకరించాం. దుక్కులు చేపట్టి సేంద్రియ ఎరువులు పంట పొలాల్లో చల్లకాలు చేశాం. జులై రెండవ వారంలో వరి నారు సాగు చేసేందుకు విత్తన సేకరణలో ఉన్నాం. వ్యవసాయ పనులకు అవసరమైన ఖర్చులకోసం బ్యాంకులో రుణాలు రెన్యువల్ చేసుకుంటున్నాం.

- లక్ష్మిరెడ్డి, రైతు, అయ్యవారిపల్లి,చాపాడు.

బ్యాంకు రుణాలు సిద్ధం చేసుకుంటున్నాం

ఖరీఫ్‌లో వ్యవసాయ పనులు చేపట్టేందుకు అవసరమైన నిధుల సేకరణలో బ్యాంక్ రుణాలు కోసం తిరుగుతున్నాం. ప్రస్తుతం బ్యాంకులో పాత బకాయిలు చెల్లించి నూతనంగా రుణం పొందేందుకు ఏర్పాటు చేసుకుంటున్నాం. విత్తనాలు, ఎరువులు సేకరించాలంటే నగదు సిద్ధంగా ఉంచుకోవాలి. గత ఏడాది వరి పంట సాగు చేసి తీవ్రంగా నష్టపోయాం. ప్రస్తుతం ఇతర పంటలు సాగు చేసే అవకాశం లేకపోవడంతో తిరిగి వారి సాగుకు చర్యలు చేపడుతున్నాం.

- ఆంజనేయులు, రైతు ,ఖాదర్‌పల్లె.



సేంద్రియ ఎరువులు సేకరిస్తున్న రైతు

ప్రభుత్వ విద్యా రంగాన్ని బలోపేతం చేయాలి

యుటిఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్‌లో నాయకుల పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీరాజ

ప్రజాశక్తి- కడప అర్బన్

నూతనంగా కొలువు తీరబోయే కొత్త ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసే కార్యాచరణతో ముందుకు వెళ్లాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు కోరారు. సోమవారం కడప యుటిఎఫ్ భవన్ లో యుటిఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. మధ్యంతర కౌన్సిల్ సందర్భంగా ఎస్‌టిఎఫ్ఐ పతాకాన్ని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీ రాజ, యుటిఎఫ్ పతాకాన్ని జిల్లా అధ్యక్షుడు మాదన విజయ కుమార్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రభుత్వ విద్యారంగాన్ని కుక్కలు చింపిన విస్తరిలా తయారు చేసిందని పేర్కొన్నారు. ఉపాధ్యాయ నియామకాలు చేపట్టకుండా పాఠశాలల విలీనం, మూడు రకాల సిలబస్ లు ప్రవేశపెట్టడం, ఒకే మాధ్యమం లోనే విద్యను బోధించాలనడం, ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయకుండా బోధనేతర పనులలో భాగస్వాములను చేయడం, అనవసరమైన యాప్‌లతో వేధించడం తదితర కారణాలతో ప్రభుత్వం ఏకపక్షంగా ముందుకు వెళ్లిందని తెలిపారు. న్యాయబద్ధమైన సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించకుండా ప్రతి దాడులకు పూనుకుని, కేసులు పెట్టడం, పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడం చేసిందని తెలిపారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు చెల్లించకుండా, ఒకటో తేదీ జీతం ఇవ్వడమే గొప్ప అనే పరిస్థితులను గత ప్రభుత్వం తీసుక వచ్చిందని విమర్శించారు. సమస్యలు పరిష్కరించబడాలంటే ఉద్యోగులు తమ కాళ్ళు పట్టుకునే నేర్పు ఉండాలంటూ మంత్రులు మాట్లాడారని, ఇలాంటి నియంతృత్వ వైఖరి వల్లే గత ప్రభుత్వం పతనమైందని పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారం చేపడుతున్న కూటమి ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. ఎన్నికల ముందు విద్యారంగ పరంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని తెలిపారు. మెగా డిఎస్‌సిని విడుదల చేస్తూ తొలి సంతకం చేయాలని, పాఠశాలల విలీనాన్ని రద్దు చేయాలని, జీవో నంబర్ 117 ను రద్దుచేసి ప్రాథమిక పాఠశాలలు ఒకటి నుండి 5వ తరగతి వరకు కొనసాగించాలని కోరారు. ఉన్నత పాఠశాలలో ఆరు నుండి పదవ తరగతి వరకు, ప్లస్ టు వరకు కొనసాగించాలని, ప్రాథమిక విద్యను మాతృభాషలోనే కొనసాగించాలని పేర్కొన్నారు. ఉన్నత విద్యలో మీడియాలను ఎంచుకునే హక్కు విద్యార్థులకు, తల్లిదండ్రులకు కల్పించాలని కౌన్సిల్ అభిప్రాయ పడినట్లు తెలిపారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను చెల్లించాలని, పిఆర్‌టిసిన వెంటనే ప్రకటించాలని, అంతవరకు ఇంటీరియర్ రిలీఫ్ ఫండ్ ను 27శాతం మంజూరు చేయాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలోని పెండింగ్ డిఎలను వెంటనే చెల్లించాలని, సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు. బోధనకు అడ్డంకిగా ఉన్న యాప్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ఏవైనా ప్రభుత్వ విద్యారంగం పట్ల, ఉపాధ్యాయుల పట్ల చులకన భావం ప్రదర్శించకుండా ఉండాలని, న్యాయబద్ధమైన డిమాండ్ల కోసం పోరుబాట పడతామని తెలిపారు. నూతన ప్రభుత్వం విద్యారంగ సంస్కరణలు అమలు చేసే సందర్భంలో విద్యావేత్తలు, ఎమ్మెల్సీలు, ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి, యువజన సంఘాలతో చర్చలు జరపాలని కోరారు. వీలైనంత త్వరగా సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని, లేనిపక్షంలో సమస్యల సాధనకు ఉద్యమాలు, పోరాటాలే శరణ్యంగా ముందుకు వెళ్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు, విద్యా రంగానికి సంబంధించిన పలు తీర్మానాలను కౌన్సిల్ సమావేశంలో ఆమోదించారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షురాలు ఆర్.సుజాత రాణి, జిల్లా ట్రెజరర్ కె.నరసింహ రావు, జిల్లా కార్యదర్శులు సి.వి రమణ, ఎస్.ఏజాస్ అహమ్మద్, కుర్రా చెన్నయ్య, చంద్ర ఓబుల్ రెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.రూతు ఆరోగ్య మేరి, ఐక్య ఉపాధ్యాయ పత్రిక కన్వీనర్ గాజులపల్లె గోపీనాథ్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, యుటిఎఫ్ కార్యకర్తలు హాజరయ్యారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలని ధర్నా

- డిప్యూటీ కమిషనర్‌కు వినతి పత్రం అందజేత

ప్రజాశక్తి-కడప సిటీ

కార్పొరేషన్ పరిధిలోని 18వ డివిజన్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ టిడిపి నాయకులు ధర్నా నిర్వహించారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ కడప కార్పొరేషన్ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ జి. మోహన్ బాబు, సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ పొన్నోలు సుబ్బిరెడ్డి, సిపిఐ నాయకులు వేణుగోపాల్, కెసి బాదుల్లా మాట్లాడుతూ డిప్యూటీ మేయర్ బండి నిత్యానంద రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న 18వ డివిజన్‌లోని సాయి ప్రతాప్ నగర్, జె.వి. నగర్, ఎస్.ఆర్. నగర్, స్వామి నగర్ ప్రాంతాలలో దాహం కేకలు మిన్నంటుతున్నాయన్నారు. అయినప్పటికీ డిప్యూటీ మేయర్ సమస్య పరిష్కారానికి ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు వైసిపి ఐదేళ్ల ప్రభుత్వ పాలనలో ప్రజా సమస్యలను పట్టించుకోకుండా గాలికి వదిలేసిందన్నారు. పదేళ్ల నుంచి కడప కార్పొరేషన్ పాలకమండలి వైసిపి చేతుల్లో ఉన్నప్పటికీ ప్రజలకు అవసరమైన తాగునీరు, రోడ్లు, డ్రెయినేజీ వంటి కనీస మౌలిక సదుపాయాలను కల్పించలేదన్నారు.. సాయి ప్రతాప్ నగర్ కాలనీ ఏర్పడి 25 ఏళ్లు అయిందని, ఇక్కడ 100 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. ఇక్కడికి మంచినీటి సరఫరా ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలోని స్వామి నగర్‌లోని బోరుబావి నుంచి సరఫరా అవుతుందన్నారు. మంచినీటి పైపులైనుకు లీకేజీలు ఉన్నాయన్నారు. దీంతో సాయిప్రతాప్‌నగర్‌కు సక్రమంగా నీరు చేరడం లేదని వాపోయారు. అనంతరం డిప్యూటీ కమిషనర్‌కు రాకేష్ చంద్రను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ సాయి ప్రతాప్ నగర్ నీటి సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మామీ ఇచ్చారు. కార్యక్రమంలో సాయి ప్రతాప్ నగర్ డెవలప్మెంట్ కమిటీ నాయకులు ఎం అక్బర్ బాషా, చంద్రారెడ్డి, ఆదినారాయణ రెడ్డి, సుబ్బారెడ్డి, లక్ష్మీనారాయణ, తెలుగుదేశం పార్టీ నాయకులు నాగేశ్వర్ రెడ్డి, సిరాజ్‌బాష, వసంతరెడ్డి, రహమాన్, నరసింహులు, చెన్నకేశవులు, సాయి ప్రతాప్ నగర్ ప్రజలు పాల్గొన్నారు.



కార్పొరేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

నీట్ పరీక్ష ఫలితాలపై సమగ్ర విచారణ చేపట్టాలి


ప్రజాశక్తి - కడప అర్బన్

నీట్ పరీక్ష 2024 ఫలితాలు, నీట్ పరీక్ష నిర్వ హణపై విద్యార్థులు, తల్లిద ండ్రులు నుంచి అనేక అను మానాలు వ్యక్తమవు తున్న ందున నీట్ పరీక్ష నిర్వహణ తీరుపై సమగ్ర విచారణ నిర్వ హించి విద్యార్థులందరికీ న్యాయం చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. సోమవారం కడప పాత బస్టాండ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 నీట్ పరీక్షల నిర్వహణ బాధ్యత చేపట్టిన ఎన్‌టిఎ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) వ్యవహరించిన తీరుపై దేశవ్యాప్తంగా అనేక అనుమానాలు, అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నందున పారదర్శకత పరీక్ష నిర్వహణపై ప్రత్యేక దర్యాప్తు సంస్థలతో సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష ఫలితాలలో ఒకే పరీక్ష కేంద్రం ఉన్న ఒకే సీరియల్ నంబర్లతో కూడిన ఉన్న విద్యార్థులకు ర్యాంకులు రావడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. లక్షలాది మంది విద్యార్థులు దీనిపై తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఎన్‌టిఎ వ్యవహరించిన తీరుపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నగర ఉపాధ్యక్షులు విజయ్ పాల్గొన్నారు.

కెఎస్ఆర్ఎం, 'సర్వీస్ నౌ' మధ్య కుదిరిన ఎంఒయు

ప్రజాశక్తి - కడప అర్బన్

బిటెక్ 3వ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు సర్వీస్ నౌ వారిచే సర్టిఫికేషన్ ప్రోగ్రామ్ అంది ంచేందుకు ఎంఒయు కుదుర్చు కున్నారు. సోమవారం అవగాహన సదస్సు నిర్వహి ంచారు. సర్వీస్ నౌ డైరెక్టర్ జి.భాస్కర్ మాట్లాడుతూ సర్వీస్ నౌ అడ్మినిస్ట్రేషన్ అండ్ అప్లికేషన్ డెవలపర్ కోర్సెస్ చేయడం వల్ల విద్యార్థిని, విద్యార్థులకు అధునాతన సాంకేతిక నైపుణ్యంతో పాటు ప్రముఖ కంపెనీలలో ఉపాధి అవకాశాలు పొందడానికి దోహదం చేస్తాయని చెప్పారు. ఏపీ లోని ప్రయివేట్ అటానమస్ కళాశాలలో ఇటువంటి అవగాహన కార్యక్రమం మొదటిదని తెలిపారు. విద్యార్థులు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కె.రాజేశ్వరి,వైస్ చైర్మన్ మదన్ మోహన్ రెడ్డి,మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ చంద్ర ఓబుల్ రెడ్డి ప్రిన్సిపల్ డాక్టర్ వి.ఎస్.ఎస్. మూర్తి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.నాగేశ్వర ప్రసాద్, సీనియర్ టి పి ఓ ఆర్.నాగరాజు, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి.ప్రేమ్ కుమార్, విద్యార్థి, విద్యార్థులు పాల్గొన్నారు.



డైరెక్టర్ భాస్కర్‌ను సన్మానిస్తున్న చంద్ర ఓబుల్ రెడ్డి

బధిరుల క్రికెట్ టోర్నీ విజేత తెలంగాణ

ప్రజాశక్తి - కడప

కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన బధిరుల టి-20 క్రికెట్ టోర్న మెంటు ఫైనల్ మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టుపై తెలం గాణ జట్టు విజయం సాధిం చింది. ఆంధ్రప్రదేశ్ జట్టుకు బిల్లా రాజు నాయకత్వం వహిం చగా తెలంగాణ జట్టుకు జి. రాజారాం కెప్టెన్‌గా వ్యవహరించారు. హోరాహోరీగా జరిగిన ఈ పోటీలలో తెలంగాణ జట్టు ప్రథమ స్థానంలో నిలవగా రెండవ స్థానంలో ఆంధ్రప్రదేశ్ జట్టు నిలిచింది. అనంతరం నిర్వహించిన బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ పారిశ్రామికవేత్త ప్రదీప్, బదురుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. దౌలత్ ఖాన్ విజేతగా నిలిచిన తెలంగాణ జట్టుకు, రన్నర్స్ గా నిలిచిన ఆంధ్రప్రదేశ్ జట్టుకు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మన ఆరోగ్యాన్ని, కమ్యూనికేషన్ స్కిల్స్ ని మెరుగుపరిచి రాష్ట్రాల మధ్య సత్సంబంధాలను, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని తెలియజేశారు. మైదానం ఇచ్చి సహకరించిన జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఏ. రెడ్డి ప్రసాద్‌కు, సహాయ సహకారాలు అందించిన కడప నగర ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారికి, నగదు పురస్కార మందించిన శివ స్టూడియో అధినేత వేముల శివయ్యకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు.

భువనేశ్వరిని కలిసిన శ్రీనివాసరెడ్డి, మాధవి

ప్రజాశక్తి - కడప అర్బన్

విజయవాడలోని ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాసంలో ఆయన సతీమణి భువనేశ్వరిని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, కడప జిల్లా టిడిపి అధ్యక్షులు శ్రీనివాస రెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవి మర్యాదపూర్వకంగా కలిశారు. బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



బొకే అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- కడప అర్బన్

నగరంలోని హబీబుల్లావీధిలో నందమూరి బాలకృష్ణ, జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు షేక్. అల్లా బకాష్ ఆధ్వర్యంలో హిందూపురం ఎమ్మెల్యే, నటసింహం నందమూరి బాలకృష్ణ 64వ పుట్టినరోజు పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా టిడిపి నగర ప్రధాన కార్యదర్శి జల తోటి జయకుమార్ మాట్లాడుతూ తండ్రి నట వారసత్వాన్ని, రాజకీయాలలో రాణించి హిందూపురం ఎమ్మెల్యేగా మూడు పర్యాయాలు విజయం సాధించడం తెలుగుదేశం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ఏంతో సంతోషమైన విషయమన్నారు.

ఎరువుల దుకాణాలపై తనిఖీలు నిర్వహించాలి

ప్రజాశక్తి - బద్వేలు

పట్టణంలో కల్తీ ఎరువులు, కల్తీ విత్తనాలను విక్రయిస్తున్న ఎరువుల అంగళ్లపై దాడి చేసి వాటిని అరికట్టాలని, సకాలంలో సబ్సిడీని అందించి రైతులను ఆదుకోవాలని డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని డిమాండ్ చేశారు. బద్వేల్ పట్టణ రూరల్ కమిటీల ఆధ్వర్యంలో సోమవారం అగ్రికల్చర్ ఆఫీసర్ ఎడిఎ ఎం. నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ బద్వేల్ నియోజకవర్గంలో రెండేళ్ల నుంచి భూసార పరీక్షలు చేస్తున్నారే తప్ప వాటి ఫలితాలు ఇప్పటివరకు ప్రకటించలేదని తెలిపారు. దీని కారణంగా బద్వేల్ నియోజకవర్గం లో వ్యవసాయంపై ఆధారపడి ఉన్న రైతులు తీవ్రమైన నష్టాలకు గురవుతున్నారని చెప్పారు. వెంటనే ఫలితాలను ప్రకటించి రైతుల అభివృద్ధికి సహకరించాలని పేర్కొన్నారు. బద్వేల్ ప్రాంతంలో అధికంగా నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తున్నారని వాటిని గుర్తించి కల్తీ ఎరువుల బారి నుండి రైతులను కాపాడాలన్నారు. అతి తక్కువ ధరకు వ్యవసాయ పనిముట్లు అందించాలని, సకాలంలో భూ సారాన్ని పెంచే జిప్సం, జింక్ ప్రభుత్వ సబ్సిడీతో పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.కె. మస్తాన్ షరీఫ్, గంగనపల్లి నాగార్జున, రూరల్ కార్యదర్శి యు బాల గురవయ్య, ఉపాధ్యక్షులు యువరాజ్, ఆంజనేయులు, ట్రెజరర్ సురేంద్ర పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారాన్ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- గోపవరం

ఈనెల 12న టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా టిడిపి నాయకులు అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బద్వేల్ టిడిపి సీనియర్ నాయకులు కొంకుల రాంబాబు కోరారు. సందర్భంగా టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, కమలాపురం ఇన్‌ఛార్జి కొత్త నరసింహారెడ్డితో ఆయన గన్నవరం ఎయిర్‌పోర్టు ఎదురుగా చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి చేస్తున్న సభ వేదిక ఏర్పాటులను పరిశీలించారు. నూతన ప్రభుత్వానికి, నాయకులకు వారు శుభాకాంక్షలు తెలియజేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన, గుణాత్మకమైన విద్య అందుతుందని మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ ప్రైమరీ స్కూల్ వక్కల పేట పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు, ఎస్‌టియు జిల్లా కార్యదర్శి ఎస్.నజీబుల్లా అన్నారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా వక్కలపేటలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరుగుతూ మీ పిల్లలను ప్రభుత్వ బడిలోనే చేర్పించాలని, వారి భవిష్యత్తును తీర్చి దిద్దడానికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో మంచి విలువలతో కూడిన విద్య, చాలా అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని పేర్కొన్నారు. విశాలమైన తరగతి గదులు, మంచి ఆట స్థలం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లితండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కూటమి విజయం హర్షణీయం

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటం విజయం సాధించడం హర్షణీయమని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శివార్జున అన్నారు. సోమవారం సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బడుగు, బలహీన వర్గాల తో పాటుగా ఉపాధ్యాయ, ఉద్యోగుల విజయమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉపాధ్యాయ బదిలీలలో కౌన్సిలింగ్ విధానాన్ని ప్రవేశపెట్టి, ఉపాధ్యాయుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టారన్నారు. ఆ విధానమే నేటికీ అమలులో ఉందన్నారు. 12వ పిఆర్‌సి, పెండింగ్ డిఎలు, 117 జీవో రద్దు మొదలగు సమస్యలన్నీ తెలుగుదేశం కూటమి ప్రభుత్వంలో పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలుగు ప్రజలకు రాజకీయ చైతన్యాన్ని కలిగించిన మేరు నగధీరుడు, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు వారసుడిగా చలనచిత్ర రంగంలోనూ, రాజకీయ రంగంలోనూ అశేష ప్రజాదరణ పొందిన నందమూరి బాలకృష్ణకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి బాలకృష్ణ చొరవ తీసుకుంటారని ఆశిస్తున్నామన్నారు.

కేంద్ర మంత్రి వర్గంలో 'అత్వాలే'కు చోటుపై హర్షం

ప్రజాశక్తి - కడప అర్బన్

కేంద్రంలో మూడో సారి బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు, సోషల్ జస్టిస్ ఎంపవర్ మెంట్ శాఖ కేంద్ర మంత్రిగా పనిచేసిన రాందాస్ అత్వాలేకు మూడో సారి కేంద్ర మంత్రి వర్గంలో చోటు దక్కడంతో ఆ పార్టీ సౌత్ ఇండియన్ జనరల్ సెక్రటరీ నాగ దాసరి అజయ్ ప్రసన్న, ఏపి రాష్ట్ర లీగల్ సెల్ చైర్మన్ వై.రమేష్ బాబు హర్షం వ్యక్తంచేశారు. ఆర్‌పిఐ జాతీయ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ డాక్టర్ వెంకటస్వామి ఆదేశాల మేరకు నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఎన్‌డిఎ కూటమిలో భాగస్వామిగా ఉన్న అత్వాలే కేంద్ర మంత్రి గా 10 సంవత్సరాలు సేవల ందించారని చెప్పారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వెంకట స్వామి పర్యవేక్షణలో ఎపిలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఎన్‌డిఎ కూటమికి భేషరతుగా మద్దతు ఇవ్వడం వల్ల ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ, అంబేద్కర్ ఆలోచనా పరుల ఓట్లు ఎన్‌డిఎకు గంప గుత్తగా పడ్డాయని చెప్పారు. సమావేశంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు రవికుమార్, ట్రేడ్ యూనియన్ జనరల్ సెక్రటరీ గంగన పల్లె నరసింహ, నగర అధ్యక్షుడు నాగ దాసరి గాంధీ పాల్గొన్నారు.

గంగమ్మ హుండీ ఆదాయం రూ.1.94 లక్షలు

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

స్థానిక మండల పరిధిలోని కొత్తపేటలో వెలిసిన గంగమ్మ దేవస్థానం హుండీని లెక్కించారు. హుండీ ఆదాయం రూ. 1,94097 నగదు వచ్చిందని ఆలయ ఇఒ సురేష్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఏప్రిల్ 29 నుంచి ఈనెల 10 వరకు హుండీని లెక్కించగా ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


చిన్నప్పను సన్మానిస్తున్న అధికారులు, రైతులు

మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ చిన్నప్ప సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ చిన్నప్పను కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఆయన ఈనెల 5న తన పదవికి రాజీనామా చేశారు. సోమవారం మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ చిన్నప్పను వీసీ వ్యాపారస్తులు, రైతులు హనుమంతరెడ్డి, మనోహర్‌రెడ్డి, శీను, రమణారెడ్డి, సాదక్, అశ్వర్థరెడ్డి, మార్కెట్ యార్డ్ సెక్రటరీ రత్నరాజు, సూపర్‌వైజర్ రామకృష్ణ, మార్కెట్ యార్డ్ సిబ్బంది పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గోటూరు చిన్నప్ప ఆధ్వర్యంలో మార్కెట్ యార్డ్ అభివృద్ధి చెందిందన్నారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సహకారంతో మార్కెట్ యార్డులో వీసీ కాయల రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు మండీ ఏర్పాటు కోసం చిన్నప్ప కృషి చేశారన్నారు. కార్యక్రమంలో రైతులు, మార్కెట్ యార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాయచోటి-వేంపల్లె రోడ్డును సత్వరమే పూర్తి చేయాలి : తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

అసంపూర్తిగా ఉన్న రాయచోటి-వేంపల్లె రోడ్డును సత్వరమే పూర్తి చేయాలని పిసిసి మీడియా ఛైర్మన్ ఎన్.తులసిరెడ్డి కోరారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమైన రాయచోటి-వేంపల్లె రోడ్డు చాలా అధ్వాన్నంగా ఉందన్నారు. పులివెందుల నుంచి వేంపల్లె, రాయచోటి మీదుగా.. ప్రొద్దుటూరు నుంచి వేంపల్లె మీదుగా రాయచోటి, పీలేరు, చిత్తూరు, తిరుపతి, మదనపల్లె, బెంగళూరుకు పోవాలంటే ఈ రోడ్డు నుంచే వెళ్లాలన్నారు. వైసిపి పాలనలో మూడు సంవత్సరాల క్రితం రోడ్డు విస్తరణ పేరుతో పాత రోడ్డును, కల్వర్టులను తవ్వారని తెలిపారు. కాంట్రాక్టరు కూడా చనిపోవడంతో ఆ పనులు నిలిచిపోయాయని పేర్కొన్నారు. రాయచోటి-వేంపల్లె రోడ్డులో ప్రయాణికులు వెళ్లాలంటే నరకయాతన పడాల్సివస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వాహనాలు దెబ్బ తింటున్నాయని వాటి యజమానులు వాపోతున్నారని తెలిపారు. జగన్ ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణానికి గుర్తుకురాయని పేర్కొన్నారు. జగన్ అధికారంలోకి రాకపోవడానికి రోడ్డును నిర్లక్ష్యం చేయడం కూడా ఒక కారణమన్నారు. ఇప్పుడైనా చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలోని రోడ్ల పరిస్థితిపై దృష్టి పెట్టాలని తులసిరెడ్డి కోరారు.

లింగ వివక్షత నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని సురభి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం డాక్టర్ లావణ్య ఆధ్వర్యంలో లింగ వివక్షత నిర్మూలనపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సమావేశానికి జిల్లా మాస్ మీడియా అధికారి భారతి ముఖ్య అతిథిగా మాట్లాడుతూ జీవిలి మనదేశంలో గణాంకాలు తీసుకుంటే ప్రతి 1000 మంది బాలురకు, 990 మంది బాలికల మాత్రమే ఉన్నారన్నారు. ఇందుకు కారణం కొడుకుపై తల్లిదండ్రులకు ఉన్న ప్రేమ అన్నారు. కొడుకు వంశోద్ధారకుడని అంటారన్నారు. గర్భిణులకు స్కానింగ్ చేసే ఆడ, మగ బిడ్డ అనే విషయం ఎవరికీ చెప్పకూడదన్నారు. చెబితే సెక్షన్ 22, 23, 24 చట్టప్రకారం చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీ హెచ్ఈఓ రామకృష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్ కుమారి, రమణమ్మ, పీహెచ్ఎన్ లక్ష్మీ దేవి, ఎంపీ హెచ్ఎస్ శాంతమ్మ, ఎఎన్ఎంఎస్ లు, ఆశ వర్కర్లు, గర్భిణులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి - దువ్వూరు


గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యులు

గర్భం దాల్చినప్పటి నుంచి ప్రతిరోజూ మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ప్రభుత్వ ప్రాథమిక వైద్యాధికారులు డాక్టర్ సురేష్ బాబు, డాక్టర్ హేమలత, డాక్టర్ విజిత, డాక్టర్ షేక్ రోషిణి సూచించారు. స్థానిక పిహెచ్‌సిలో సోమవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గర్భిణులకు పలు సూచనలు చేశారు. ప్రతి నెల క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ సందర్భంగా 73 మంది గర్భిణులకు కావడం పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మేరీ సువర్ణ, పిహెచ్ఎన్ శాంతకుమారి పాల్గొన్నారు.

ఘనంగా బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - వేంపల్లె

హిందుపురం ఎమ్మెల్యే, నటసింహం బాలకృష్ణ పుట్టిన రోజు వేడుకలను సోమవారం వేంపల్లెలో ఘనంగా నిర్వహించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి యూత్ నాయకులు చైతన్య కుమార్, యాసిన్ ఆధ్వర్యంలో కార్యకర్తల మధ్య వేడుకలు నిర్వహించారు. టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ కేక్ కట్ చేసి కార్యకర్తలకు, అభిమానులకు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందమూరి బాలకృష్ణ నటనలో తనదైన రీతిలో నటిస్తూ, రాజకీయాల్లో ప్రజలకు తండ్రికి తగ్గ తనయుడని గొప్ప పేరు సంపాదించుకున్నట్లు చెప్పారు. తన తల్లి జ్ఞాపకార్థం క్యాన్సర్ రోగులకు ఉచితంగా వైద్యం అందించడానికి హైదరాబాదులో బసవతారకం హాస్పిటల్ ను పెట్టారన్నారు. టిడిపి జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు బాలసాయిరెడ్డి, పూల అల్లాబక్ష్, రామ గంగిరెడ్డి, కరీముల్లా, గోటూరు నాగభూషణం, ఇబియాస్, మహబూబ్ షరీఫ్, సయ్యద్ పీరా, సుబ్బరాయుడు, ఫయాజ్, పాపిరెడ్డి మస్తాన్, జగన్, అరుణ్ కుమార్, రాజగోపాల్, గంగాధర్ రెడ్డి, మహేంద్ర, వలీ, సాంబ జిలాన్, రాజు, మహమ్మద్ పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : నందమూరి బాలకృష్ణ 64వ జన్మదిన వేడుకలను పులివెందుల పట్టణంలో వల్లెపు నాగార్జున, హరి, ఇబియాజ్, వల్లి, సుధాకర్, అమర్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మాజీ మార్కెట్ యార్డ్ ఛైర్మన్ తూగుట్ల మధుసూదన్‌రెడ్డి కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటు సినీ, రాజకీయ రంగాల్లో బాలకృష్ణకు ఎదురులేదన్నారు. హిందూపురం నుండి వరుసగా మూడవసారి ఎమ్మెల్యేగా ఎన్నికైనందుకు ఆయనకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. బాలయ్య నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఇలానే పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బాలకృష్ణ అభిమానులు పాల్గొన్నారు.


మధుకు కేక్ తినిపిస్తున్న బాలయ్య అభిమానులు

పత్తి సాగుపై రైతన్న చూపు

విత్తే పనిలో రైతులు బిజీ.. ఇప్పటికే 5 వేల ఎకరాల్లో సాగు


పొలంలో పత్తి విత్తనాలు వేస్తున్న కూలీలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఖరీఫ్‌లో పత్తి పంట సాగు చేయడానికి రైతన్న మక్కువ చూపుతున్నాడు. పత్తి విత్తే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఇటీవల కురిసిన భారీ వర్షానికి సుమారు మూడు వేల మంది రైతులు పత్తి సాగును ముమ్మరం చేశారు. రోహిణి కార్తెలో విత్తితే వంగడాలు బలంగా ఉండడంతోపాటు దిగుబడులు ఎక్కువ వస్తుందని రైతుల అభిప్రాయం. అందులో భాగంగా ఈ కార్తెలో విత్తనాలను విత్తేందుకు రైతులు ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. పత్తి విత్తే పనులను వేగవంతం చేశారు. రైతులు ఈ ఏడు పత్తి పంటపై ఆసక్తి చూపుతున్నారు. బోరు బావుల కింద ఏప్రిల్ రెండవ వారం నుంచే పత్తిని సాగు చేశారు. వేసవిలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు అవకాశం లేక ఈ పంటను ఎంచుకున్నారు. కొంతమంది రైతులు మిరప పంటను సాగుచేసినప్పటికీ ఎక్కువ విస్తీర్ణంలో పత్తి పంట సాగైంది. ఎండలకు తట్టుకుని వర్షాలు వచ్చేవరకు పంట దెబ్బతినదనే ఉద్దేశంతో ఎక్కువగా పత్తిపైనే మొగ్గు చూపామని రైతులు చెబుతున్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఎండలతో ఈ ఏడాది 15రోజులు ఆలస్యంగా పంటను సాగు చేశారు. పంటసాగు చేసి 50 రోజులు కావస్తోంది. వ్యవసాయ బోర్లు, బావుల కింద సాగు నియోజకవర్గ వ్యాప్తంగా వేసవిలో వ్యవసాయ బోర్లు, బావుల కింద రైతులు పత్తి సాగు చేశారు. ఇదివరకు ఖరీఫ్‌లో ఎక్కువ భాగం వేరుశెనగ సాగు చేసేవారు. ఆ పంటలో పెట్టుబడులు పెరిగిపోవడం, దిగుబడులు తగ్గడం, ధరలు కూడా ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు పత్తిని ఎంచుకున్నారు. పత్తిలో దిగుబడులు బాగా ఉండడం, ధరలు కూడా ఆశాజనకంగా ఉండడంతో చాలా మంది ఆసక్తి చూపించారు. వేసవిలో ఇతర ప్రత్యామ్నాయ పంటల సాగుకు ఈ సీజన్ అనుకూలం లేక పత్తి సాగుకే ఆసక్తి చూపామని రైతులు అంటున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు నియోజకవర్గంలో 5వేల ఎకరాల్లో సాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. నియోజకవర్గంలోని వేముల, వేంపల్లె మండలాల్లో అత్యధికంగానూ, పులివెందుల, చక్రాయపేట, తొండూరు, లింగాల మండలాల్లో అక్కడక్కడ పత్తి పంట సాగు చేసుకున్నారు. ప్రస్తుతం అదునుకు వర్షాలు పడడంతో పత్తి సాగుపై రైతులు ఆసక్తి చూపడంతో విస్తీర్ణం బాగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. రెండేళ్లుగా పత్తి ధరలు నిలకడగా ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు పత్తి సాగుపైనే ఆశలు పెట్టుకున్నారు. ఈ ఏడాదైనా పత్తి పంట దిగుబడి బాగా వచ్చి రైతన్న లాభాల బాటలో ఉండాలని ఆశిద్దాం.


బోరు బావుల కింద సాగైన పత్తి

విశిష్ట విజయాలకు శాశ్వత చిరునామా 'శ్రీవిద్యాధరి'

పిల్లలు ఇష్టపడేలా వివిధ రకాల బొమ్మలు - ఆల్ రౌండ్ ప్రతిభకు అత్యుత్తమ ఛాయిస్


విద్యార్థులతో పాఠశాల సిఇఒ భాను ప్రకాష్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

విశిష్ట విజయాలకు శాశ్వత చిరునామాగా నిలుస్తూ.. మెరుగైన విద్యను అందిస్తూ.. పిల్లల కోసం రంగురంగుల గోడలపై నవ్వు పుట్టించే బొమ్మలు.. చదువు సంస్కారంతోపాటు ఆటపాటలకు సాంస్కృతిక కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యతనిచ్చే 'శ్రీ విద్యాధరి ఉన్నత పాఠశాల' అంటే పిల్లలకు, వారి తల్లిదండ్రులకు ఎక్కువ మక్కువ. ఆ పాఠశాల గురించి సిఇఒ భాను ప్రకాష్ 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ.. పిల్లలకు మెరుగైన విద్యను అందించాలనే తపనతో శ్రీ విద్యాధరి ఉన్నత పాఠశాల ప్రారంభానికి కారణమైందన్నారు. 15ఏళ్లుగా విద్యా వైజ్ఞానికాసాంస్కృతిక సేవా రంగాల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతూ వారు ఆల్ రౌండ్ పర్సనాలిటీ డెవలప్మెంట్ కోసం నిస్వార్థంగా నిరంతరాయంగా అలుపెరగని అంకిత భావంతో కృషి చేస్తున్న శ్రీ విద్యాధరి పాఠశాల. ఒకటి నుండి 5వ తరగతి వరకు ఐసిఎస్ఇ సిలబస్‌ను ప్రాథమిక పాఠశాల స్థాయిలో పరిచయం చేసి ఒక సాహసోపేత నిర్ణయం తీసుకున్నామన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఐఐటి విజయ ఫలాలను అందియ్యాలనే సంకల్పంతో వారి స్వప్నం సాకారం కావాలని ఐఐటి గురువు చుక్కా రామయ్య ఆశీస్సులతో పులివెందులలో మొట్ట మొదటిసారిగా హైస్కూల్ స్థాయి నుంచి ఐఐటి-ఒలంపియాడ్ ఫౌండేషన్ వంటి అడ్వాన్స్ తను పరిచయం చేసిన మొదటి విద్యా సంస్థ శ్రీ విద్యాధరి అన్నారు. విద్య చరిత్రలో 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు ఐఐటి, ఒలంపియాడ్ ఫౌండేషన్‌లో శిక్షణ ఇస్తున్నామన్నారు. తద్వారా తమ విద్యార్థులు మెడికల్ కాలేజీలో కూడా సీటు సాధించారన్నారు. వివిధ ఎన్ఐటి కళాశాలలో సీట్లు సాధించారన్నారు. అలాగే వివిధ ఐఐటి కాలేజీల్లో సీట్లు సాధించామన్నారు.

చక్కటి వాతావరణంలో పాఠశాల..

చక్కటి వాతావరణంలో విద్యార్థులు పాఠశాలలో ఉల్లాసంగా, ఉత్సాహంగా గడుపుతారన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మ్యాథ్స్, సైన్స్ డే, గ్రాడ్యుయేషన్ డే, చిల్డ్రన్స్ డే నిర్వహిస్తామన్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాల పునఃప్రారంభం రోజు వెల్కమింగ్ డే నిర్వహిస్తామన్నారు. తామంతా ఒక్కటే అని తమలో పేద, ధనిక భావం లేదనే ఆలోచన వచ్చేందుకు తరచూ విద్యార్థులతో మాట్లాడుతూ ఉంటామన్నారు.

శ్రీ విద్యాధరి బ్లూ మింగ్ డేల్స్..

ప్రీ ప్రైమరీ చిన్నారుల మరో ప్రపంచం శ్రీ విద్యాధరి బ్లూమింగ్ డే ల్స్. దేశంలోని ప్రముఖ చిన్నపిల్లల మనస్తత్వ శాస్త్రవేత్త అభిప్రాయం మేరకు నర్సరీ, ఎల్‌కెజి, యూకేజీ తరగతుల పిల్లల కోసం లర్నింగ్ బై ప్లేయింగ్ ద్వారా విద్య పట్ల ఆసక్తి పెంపొందించవచ్చని ఆలోచనలను పక్కా ప్రణాళికతో అమలుపరిచిన విద్యాసంస్థ శ్రీ విద్యాధరి. సృజనాత్మకతతో కూడిన విద్యా వికాసం, వినోదంతో కూడిన ఆక్టివిటీస్ ద్వారా చిన్నారుల భవిష్యత్తుకు బలమైన బీజం వేస్తున్న సంస్థ శ్రీ విద్యాధరి.

సైన్స్ ఫెయిర్ పోటీల్లో ఎన్నో అవార్డులు సాధించాం..

జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో జరిగిన వివిధ సైన్స్ ఫెయిర్, కేంద్ర ప్రభుత్వం ఇన్‌స్పెయిర్ అవార్డ్స్, సైన్స్ ఫెయిర్లలో ఎన్నో బహుమతులు కూడా తమ పాఠశాల విద్యార్థులు సాధించారని సిఇఒ తెలిపారు. గుంటూరు వారు నిర్వహించిన వివిధ పోటీల్లో తమ విద్యార్థులు ఎన్నో బహుమతులు సాధించారన్నారు. గణిత విభాగంలో రాష్ట్రస్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకమైన రామానుజన్ గణిత బాల అవార్డ్సులో ఎనిమిదేళ్లుగా ర్యాంకులు సాధించామన్నారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించామన్నారు. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ రాష్ట్రస్థాయి పోటీలకు కూడా తమ విద్యార్థులు ఎంపికయ్యారన్నారు.

సాంస్కృతిక, సేవా రంగాల్లో శ్రీవిద్యాధరి విద్యార్థులు ముందంజ

సేవా తత్పరులు శ్రీ విద్యాధర చిన్నారులు అని పాఠశాల ప్రిన్సిపల్ నాగరాజు పేర్కొన్నారు. తుఫాను వరద బాధితుల సహాయార్థం, మానసిక ఇబ్బందులు పడే వారి సహాయార్థం తమ పాఠశాల విద్యార్థులు చూపించిన దాతృత్వం మరవలేదన్నారు. ముఖ్యంగా సేవా రంగంతోపాటు, సాంస్కృతిక రంగంలో కూడా విద్యార్థులు ప్రతిభ కనబరిచారని వివరించారు. కూచిపూడి మహా బృంద నాటక ప్రదర్శన ద్వారా ఎన్నో విజయాలను, రికార్డులను కూడా కొట్టామన్నారు. భోపాల్‌లో జరిగిన బల్ రంగ్ జాతీయ స్థాయి నృత్య పోటీల్లో తృతీయ బహుమతి సాధించామని తెలిపారు.

ధాన్యపు గోడౌన్ల నిర్మాణం జరిగేనా..!

ప్రజాశక్తి - చాపాడు

మండలంలో 9 సచివాలయాల పరిధిలో నూతనంగా ధాన్యపు నిలువ చేసుకునేందుకు గోడౌన్‌లను నిర్మించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. అయితే వీటి నిర్మాణ పనులు ఎక్కడ కూడా చేపట్టలేదు. కేవలం పనులు కాగితాలకే పరిమితమయ్యాయి. నక్కలదిన్నె గ్రామంలో 0.50 ఎకరాలలో 1000 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గౌడౌన్, బద్రిపల్లె, చాపాడు, చిన్న గురువలూరు, చియ్యపాడు, లక్ష్మీపేట, పల్లవోలు, వెదురూరు గ్రామాల్లో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోడౌన్లు, ఎన్ ఓబాయపల్లి, సోమాపురం గ్రామాల్లో 1000 మెట్రిక్ టన్నుల గోడౌన్‌ల నిర్మాణానికి అనుమతులు కూడా ఇచ్చారు. 500 మెట్రిక్ టన్నుల గోడౌన్ల నిర్మాణానికి 32 సెంట్లు, 1000 మెట్రిక్ టన్నుల గోడౌన్‌లకు 50 సెంట్ల స్థలం కూడా సేకరించారు. గౌడౌన్‌ల నిర్మాణం పూర్తి అయితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. నక్కలదిన్నెలో గౌడౌన్ నిర్మాణానికి అవసరమైన 0.50 ఎకరాల స్థలాన్ని గ్రామానికి చెందిన చాపాడు ఛానల్ మాజీ డిస్ట్రిబ్యూటర్ ఛైర్మన్ సోముల మహేశ్వర్‌రెడ్డి వితరణ చేశారు. కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ స్థలాన్ని గోడౌన్‌కు కేటాయించారు. మండల పరిధిలో గోడౌన్లు అందుబాటులో లేకపోవడంతో మైదుకూరు, ప్రొద్దుటూరులో ఉన్న ప్రయివేట్ వాటిని రైతులు ఆశ్రయించాల్సి వస్తోంది.



'వరద' పంచన చేరేందుకు క్రికెట్ బుకీల ఆరాటం



మాట్లాడుతున్న నజీర్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అధికార పార్టీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పంచన చేరేందుకు స్థానిక క్రికెట్ బుకీలు, మట్కారాయుళ్లు, గుట్కా అమ్మేవారు ఆరాటపడుతున్నారని, ఇలాంటి వారిని దరి చేరకుండా చేయాలని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి షేక్‌పూల నజీర్ కోరారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఎన్నికల్లో గెలుపొందిన పెద్దాయనకు పార్టీ తరపున ధన్యవాదాలు తెలిపారు. పెద్దాయనను విమర్శించిన వారే ఈ రోజు ఆయనకు బ్రహ్మరథం పట్టారన్నారు. కౌన్సిలర్లుగా ఉన్న క్రికెట్ బుకీలను అక్రమ పనులు చేసేవారిని వరద దగ్గరకు రానీకుండా కట్టడి చేయాలన్నారు. ప్రొద్దుటూరులో పలుచోట్ల ఇలాంటి చర్చే జరుగుతోందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో పోలీసులు అక్రమాలను దగ్గరుండి నడిపించారన్నారు. తన పార్టీ వేరైనప్పటికీ తాను పెద్దాయన శిష్యుడినే అన్నారు. రాచమల్లు ప్రసాదరెడ్డి గతంలో ఎమ్మెల్యే అయ్యాడంటే పెద్దాయన చలువే అయినప్పటికీ, పెద్దాయనకు రాచమల్లుకు చాలా తేడా ఉందన్నారు. పెద్దాయన ప్రజలకు మరింత సేవలందించి చేరువ అవుతారని నమ్ముతున్నామన్నారు. ఆరు పర్యాయాలు గెలిచిన పెద్దాయనకు ఈ సారి మంత్రి పదవి ఇవ్వాలని నజీర్ కోరారు. ప్రొద్దుటూరు అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు జిలాన్ పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో బియ్యం, వస్త్రాలు పంపిణీ

ప్రజాశక్తి - మైదుకూరు

మండలంలోని భూమాయపల్లె సమీపంలో ఉన్న అమ్మ వృద్ధాశ్రమంలో సోమవారం చాపాడు మండలం చియ్యపాడు గ్రామానికి చెందిన దివంగత టీచర్ జానయ్య, ధర్మపత్ని లలితమ్మ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో బియ్యం ప్యాకెట్, వస్త్రాలు, పండ్లు పంపిణీ చేశారు. ఇందిరమ్మ, సుబ్బన్న, కండక్టర్ తప్పేట ఉత్తానపాదుడు, సుబ్బరామాంజనమ్మ, ఆశ్రమ నిర్వాహకులు సాంబయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు మిద్దె వెంకటరమణ, తప్పేట హరిబాబు, చాపాడు మండల టిడిపి యువ నాయకుడు పాల్గొన్నారు.

IN THE COURT OF THE HONORABLE JUNIOR CIVIL JUDGE, KAMALAPURAM

E.P.No. 22/2022 In O.S.No. 36/2020

Korrapati Rajasekhar

...Petitioner/D.Hr

Vs

Gujjala Bhairavaiah@Bhairavaiah Yadav, died his L.Rs Gujjala Nagasubbamma.

...Respondent/J.Dr

PROCLAMATION

ఇందు మూలముగా యావన్మందికి ప్రజానీకానికి తెలియజేయడం ఏమనగా ఈ క్రింది షెడ్యూల్‌లో వివరించబడిన ఆస్తిని 25.06.2024వ తేదీన, రాజశ్రీ కమలాపురం జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు నందు బహిరంగంగా ఉదయం 10.30 గం.ల నుంచి సాయంత్రం 05.00 గం. లోపల వేలం జరపబడును. వేలము నందు ఎవరైనను పాల్గొనవచ్చును,కోర్టు షరతులు వర్తించును.

SCHEDULE

Bus bearing Registration No.AP04 X 2688 contract carriage maker name is Ashok Leyland Limited, Chassis No.XPE625238, Engine No. XPH474071.

వాయిదాద తేదీ: 25-06-2024

స్థలము : కమలాపురం

B.NARAYANA REDDY,
వాది తరపున న్యాయవాది,
Advocate,
Kamalapuram

IN THE COURT OF THE HONORABLE JUNIOR CIVIL JUDGE, KAMALAPURAM

O.S.No. 62/2022

Obulareddy Nageswara Reddy, son of Rama Subba Reddy, Aged about 45 years, Hindu, Business, residing at Bayanapalli Village, Kamalapuram Mandal, Kadapa District.

...Plaintiff

Vs

Dara Sundar Raj, Son of John, aged about 51 years, Railway Employee, Residing at Door No.43/133-14, Near Teja School, Prakash Nagar, Kadapa City and District.

...Defendant

SUMMON

పై నెంబరు దావాలోని ప్రతివాది అయిన నీకు దావా సమను తీసుకొనుటకు రాజశ్రీ కోర్టు వారు ఉత్తర్వు చేసివున్నారు. అట్టి ఉత్తర్వు మేరకు నీవు గాని నీ వకీలు ద్వారా గాని రాజశ్రీ కోర్టు యెదుట హాజరు అగుటకు 24.06.2024 తేదీన ఉదయం 10.30 గంటలకు వాయిదా వేసివున్నారు. మీకు ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలసినది, లేనియెడల రాజశ్రీ కోర్టు వారు మిమ్మల్ని పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదాద తేదీ: 24-06-2024

స్థలము : కమలాపురం

B.NARAYANA REDDY,
వాది తరపున న్యాయవాది,
Advocate,
Kamalapuram


ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఎమ్మెల్యే 'పుట్టా'కు ఘన సన్మానం

ప్రజాశక్తి - ఖాజీపేట

మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ను సోమవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. ప్రొద్దుటూరులోని ఆయన నివాసంలో మండలానికి చెందిన పలువురు టిడిపి సీనియర్ నాయకులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. మైదుకూరు నియోజకవర్గం ప్రాంత అభివృద్ధికి కృషి, రాజోలి జలాశయ ఆనకట్ట నిర్మాణం, గ్రామాల్లో శ్మశాన వాటికల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు పుట్టా సుధాకర్ యాదవ్ చెప్పారని నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో కడప మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ సందుల నాగశివారెడ్డి, టిడిపి రాష్ట్ర ముస్లిం మైనారిటీ కార్యనిర్వాహక మాజీ కార్యదర్శి సిద్దారం ఖదీరుల్లా, కెకె బ్రదర్స్, అబ్దుల్లా, జాఫర్ ఖలీల్, అసిఫ్, అర్షద్ పాల్గొన్నారు.



'పుట్టా'ను కలిసిన ఉపాధ్యాయులు

చాపాడు : మైదుకూరు ఎమ్మెల్యేగా గెలిచిన పుట్టా సుధాకర్ యాదవ్‌ను ఉపాధ్యాయ సంఘ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్టీయు నాయకులు పాలకొండ్రాయుడు, చంద్రశేఖర్, టీడీపీ నాయకుడు మేకల చిన్న ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు ఆయనను కలిశారు. సమస్యలను పరిష్కరించడంలో తమ వంతు కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. సీపీఎస్ రద్దు, ఉపాధ్యాయుల బదిలీలు తదితర సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించడంలో ప్రభుత్వ పెద్దలతో మాట్లాడాలని కోరారు.

కూరగాయల మార్కెట్‌కు రంగనాథ స్వామి పేరు పెట్టాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్


మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

స్థానిక శ్రీ రంగనాథ స్వామి ఆలయం సమీపంలో ఉన్న కూరగాయల మార్కెట్‌కు రంగనాథ స్వామి పేరు పెట్టాలని టిడిపి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధుసూదన్‌రెడ్డి సూచించారు. ఆయన తన నివాసంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ గతంలో కూరగాయల మార్కెట్‌కు రంగనాథ స్వామి పేరు ఉండే దన్నారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ పేరును తీసి వైఎస్ఆర్ కూరగాయల మార్కెట్‌గా పేరు మార్చాం న్నారు. దీనిపై అప్పుడే తాము అధికారులకు వినతిపత్రమిచ్చామన్నారు. పది రోజుల్లో కూరగాయల మార్కెట్‌కు పేరు మార్చాలని ఆయన డిమాండ్ చేశారు.

220 క్వింటాళ్ల జనుములు మంజూరు

ప్రజాశక్తి - మైదుకూరు

మండలానికి 220 క్వింటాళ్ల జనుములు, 5 క్వింటాళ్ల పిల్లిపెసర మంజూరైనట్లు మండల వ్యవసాయ అధికారిని పి.ప్రసన్న సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం నుంచి రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు తెలిపారు. జనుములు 10 కిలోలు పూర్తి ధర రూ.880 కాగా, సబ్సిడీ ధర రూ.440 రైతు చెల్లించాలని తెలిపారు. పిల్లి పెసర 10 కిలోలు పూర్తి ధర రూ.1,340కాగా, సబ్సిడీ ధర రూ.670 ఇస్తున్నామన్నారు. అవసరమైన రైతులు తప్పనిసరిగా తమ పాస్‌బుక్, 1బి, ఆధార్ జిరాక్స్, సెల్‌ఫోన్ నెంబర్ తీసుకుపోవలెనన్నారు. రైతు సెల్‌కి ఒటిపి వస్తుందన్నారు. జనుములకు రిజిస్ట్రేషన్ చేసుకొని డబ్బు చెల్లించిన రైతులకు 7 నుండి 10 రోజులలోపు వ్యవసాయ శాఖ నుండి రైతు భరోసా కేంద్రాల ద్వారా నేరుగా అందజేస్తామన్నారు.

నిరాశ్రయులకు అన్నదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

నగరిగుట్టలోని నిరాశ్రయుల వసతి గృహంలో వృద్ధులకు బండి ఓబుల్‌రెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా సోమవారం అన్నదానం కార్యక్రమం వైసిపి విద్యార్థి విభాగం నాయకులు రాఘవేంద్రరెడ్డి చేతులమీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి ఏడాది బండి ఓబుల్ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు చంద్రఓబుల్ రెడ్డి హైదరాబాద్‌లో ఉంటూ పులివెందులలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమైన విషయమన్నారు. ఈ సందర్భంగా ఆయనకు రాఘవేంద్రరెడ్డి కృతజ్ఞతాభినందనలు తెలిపారు.


అన్నదానం చేస్తున్న రాఘవేంద్రారెడ్డి